15 శాతం ఇంటి పన్నుల పెంపును వ్యతిరేకించాలి: సీపీఐ

విశాలాంధ్ర-కడప రూరల్ : 2023-24 ఆర్థిక సంవత్సరం నుండి 15 శాతం ఇంటి పన్నులను పెంచే ఆలోచనలను విరమించుకోవాలని, ఇంటి పన్నుల్లో చెత్త పన్ను కలిపొద్దని సిపిఐ కడప నగర కార్యదర్శి యన్. వెంకటశివ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీయు జిల్లా కార్యాలయంలో సిపిఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటశివ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ విషమ షరతులకు లోబడి క్రొత్త జీఓల ద్వారా జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఏటా ఇంటి పన్నులు పెంచడం, చెత్త పై పన్నులు వేయడం,యూజర్ చార్జీలు విధించడం దారుణమన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ చేస్తూ పన్నులు వసూలు చేస్తూ ఆ డబ్బులన్నింటిని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ఏళ్ల తరబడి నగరంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కొరవడిందన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఐఏఎస్ అధికారి వచ్చినప్పటికీ ప్రభుత్వ నిధుల విడుదలలో జాప్యంతో నగరాభివృద్ధి కుంటుపడుతున్నదని విమర్శించారు. బిజెపి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈనెల 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రచార బేరి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, గంగా సురేష్ నగర కార్యవర్గ సభ్యులు సావంత్ సుధాకర్, నాగరాజు, బ్రహ్మం, పగడపూల మల్లికార్జున, బందెల ఓబయ్య, ఆర్.బాబు, నాగిరెడ్డి, భాగ్యలక్ష్మి శంకర్ నాయక్, యేసురత్నం, నారాయణ, భీమరాజు, వలరాజు, పుష్పరాజు, దేవీ, నిర్మలమ్మ, రాహుల్, నాగేంద్ర, మైనుద్దీన్, వీరాంజనేయులు, మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు టీడీపీ నాయకుల ఘనస్వాగతం

విశాలాంధ్ర-వేంపల్లె: కడపకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు వేంపల్లె టీడీపీ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఆ మేరకు కడప విమానాశ్ర యంలో మైనార్టీ కార్పోరేషన్ మాజీ డైరెక్టరు షబ్బీర్, జిల్లా ఐతు సంఘం అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్య క్షుడు జగన్నాథరెడ్డి, నల్లగారి కృష్ణారెడ్డి, ఎల్వీఆర్ భాస్కర్,రెడ్డి, గోటూ రు నాగభూషణం, పూలబక్స, మాబు, షరీఫ్,, అల్లాబకాష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు. రాబోవు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు కోరినట్లు వారు వెల్లడించారు.

గ్యాస్ గౌడన్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-వేంపల్లె: గ్యాస్ గౌడన్లో పని చేసే సిబ్బంది అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు వహించాలని ఫైర్ స్టేషన్ ఇన్ చార్జ్ అధికారి శివకుమార్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం స్థానిక సాయి రజిత హెచ్‌పి గ్యాస్ గౌడన్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్యాస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని వాటి నుండి చాకచక్యంగా బయట పడాలని కోరారు. గౌడన్లో ఉన్న అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జాగ్రత్తలు వహించక పోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అగ్నిమాపక కేంద్రానికి సంబంధించిన ఫోన్ నెంబర్ ను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకొని అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందిం చాలని కోరారు. గ్యాస్ గౌడన్లో వెలుతురుతో పాటు గాలి వీచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్యాస్ గౌడన్లో లో పని చేసే సిబ్బందితో విన్యాసాలు చేయించాలి. ఈ కార్యక్రమంలో డ్రైవర్ ఆపరేటర్ చిన్న పెద్దయ్య, లీడింగ్ ఫైర్ మెన్‌లు వెంకట సుబ్బయ్య, హరిబాబు, ఎస్ ఎం డి సాలార్, ఫైర్ మెన్ ప్రభాకర్ రావు, హోంగార్డ్ జాన్ కుమార్, వెంకట రమణాచారి, గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని డిరసవంచ పంచా యతీ సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల వారీగా గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమపథకాలు ప్రతి కుటుంబానికి వాలంటీర్ల ద్వారా అందిం చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నా లలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి వాలంటీర్‌ల ద్వారా అందచేయాలని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డిరసవంచ పంచాయతీలోని మఠం జడ్పీటీసీ సభ్యులు రామగోవిందారెడ్డి, మాజీ సర్పంచ్, తనయుడు, వైకాపా సీనియర్ నాయకు లు బిజివేముల మోహన్‌రెడ్డి కలిసి గ్రామాలలో పర్యటించారు. పెద్దరాజుపల్లె, హరిజనవాడ, బీసీ కాలనీ, రామచంద్రాపురం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. గ్రామాలలో త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరి స్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘం చైర్మెన్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు గంగమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు, భర్త సుబ్బారెడ్డి, వైకాపా మండల కన్వీనర్ కూనపూలి రాజానాయుడు, ఉప సర్పంచ్ సుభాష్ చంద్రబోస్, నాయకులు, సర్పంచులు, ఎంటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర - మైలవరం : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అని మండల అధ్యక్షురాలు చేరెడ్డి సావిత్రి, వైకాపా నేత చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని బి. జంగాలపల్లె గ్రామంలో జమ్మలమడుగు శాసనసభ్యులు సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు మా నమ్మకం నీవే జగన్ అనే కార్యక్రమం లోపాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే పథకాలు అర్హులైన వారికి చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిపి దంపతులు విలేకరులతో మాట్లాడు తు ఎవరికైన అర్హులైన వారికి సంక్షేమ పథకాలు రాకుంటే సంబందించిన సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బి. జంగాలపల్లి గ్రామంలో ప్రజలు ముఖ్యమంత్రి జగన్ సంక్షేమము పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని హర్షం వ్యక్తం చేశారు.మండలంలోని 19 పంచాయ తీలలో మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం విజయవం తంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు చిన్న సుబ్బారెడ్డి, చిలకల సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, మద్దిలేటి రెడ్డి, కుళాయిప్ప, మౌలాలి, నిలయ్య, మురలి మొదలైన వారు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర - కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కేసులు పెట్టి మనల్ని నిర్బందిస్తే, పది మందిని చంపితే దాడులు చేస్తే భయపడతారని వైసిపి నాయకులు అనుకోవడం పొరపాటని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం కడప బిల్టప్ వద్ద జరిగిన జోన్-5 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చే పార్టీ తెలుగుదేశమన్నారు. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామే తప్ప ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. టిడిపి స్థాపించి 45 సంవత్సరాలు అయ్యింది. పార్టీ అభివృద్ధికి ఎప్పటికప్పుడు కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు పెడుతున్నాం. అన్ని విషయాల్లో ముందుకు వెళుతున్నామని వివరించారు. ప్రతి బూతులో 100 కుటుంబాలకు ఒక వ్యక్తిని నియమించుకున్నాం. 2009, 2014, 2019 ఎన్నికల్లో ఓట్లు ఎలా వచ్చాయని తెలుసుకుని ఓట్ల బలోపేతానికి పార్టీ అభివృద్ధి కోసం శ్రీకారం చుట్టాం..పార్టీ అభివృద్ధికి నామమాత్రంగా పనిచేస్తామని అంటే కుదరదు. పార్టీ అభివృద్ధి కోసం అందరూ మనస్ఫూర్తిగా పనిచేయాలి..క్లస్టర్ గాని మండలం గాని బూతుకు గాని ఎవరైనా సమర్థవంతంగా వుండే వారినే రాబోయే ప్రభుత్వం కచ్చితంగా టిడిపి పార్టీనే. అందులో ఎటువంటి సందేహం లేదని జోష్యం చెప్పారు. వై నాట్ 175 అని సైకో అంటున్నారు..108 నియోజకవర్గాల్లో మనం గెలిచాం అంటే వైయస్సార్ పార్టీలో భూకంపం ప్రారంభమైందని చెప్పారు పులివెందుల నుంచి రాయలసీమ ఎమ్మెల్సీగా రామ్ గోపాల్ రెడ్డి సమర్థవంతంగా కష్టపడి గెలిచాడు. రాబోయే ఎన్నికల్లో ఒక్క భోగస్ ఓట్లు లేకుండా చూసే బాధ్యత ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్చార్జిలదేనని సూచించారు. గెలుస్తామనే బాధ్యత పార్టీ, ప్రజలదే కాకుండా నాయకులపై వుందని చెప్పారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ తన తండ్రి వైయస్ రాజశేఖర రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్ష కోట్లు అక్రమార్జన చేసి 16 నెలలు చంచల్‌గూడ జైల్లో ఊసలు లెక్కపెట్టాడని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్చార్జి వియస్ అమీర్ బాబు, సీనియర్ నాయకుడు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, పుత్తా నరసిం హారెడ్డి, మల్లెల లింగా రెడ్డి, దేవగుడి నారాయణరెడ్డి, ఎస్.గోవ ర్ధన్ రెడ్డి, ఆయా నియో జకవ ర్గాలకు చెందిన నాయ కులు కార్యకర్త లు పాల్గొన్నారు.

పెద్ద దర్గా ఇఫ్తార్‌విందులో చంద్రబాబు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంగళ వారం జోన్-5 సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఆయన నగరంలోని పెద్ద దర్గాను సందర్శించారు. ముందుగా దర్గా సేవకులు చంద్రబాబుకు దర్గా సాంప్రదాయం ప్రకారం చంద్రబాబును లోనికి

సాదరంగా ఆహ్వానించగ, మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గాలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఇన్చార్జి సుధాకర్ యాదవ్, రాయచోటి రమేష్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్, హరి ప్రసాద్, శకుంతలమ్మ పాల్గొన్నారు.

పార్టీ కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలి : తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయ వలసిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్ర బాబు నాయుడు అన్నారు. మంగళవారం కడప నగరంలో పుత్త ఎస్టేట్లో ఏర్పాటుచేసిన జూన్ 5 సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయుడు కు అలంఖాన్ పల్లి లక్ష్మి రెడ్డి కుటుంబం ఘన స్వాగతం పలికింది అనంతరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అచ్చం నాయుడుకు బొకే ఇచ్చి, శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రజలు విసిగిపోయారని ఎప్పుడు ఎన్నికలు

జరిగినా తెలుగుదేశం పార్టీకి ఘన విజయం సాధించేందుకు ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పెడుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవి, మన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 160 స్థానాలు మావే

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్ష కోట్ల అక్రమార్జన చేసి, 16 నెలలు చంచల్ గూడా జైల్లో ఊచలు లెక్కపెట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత దుర్మార్గుడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చం నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నగరంలోని బిల్టప్ వద్ద పుత్త ఎస్టేట్లో నిర్వహించిన జోన్ 5 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీకే డైరెక్షన్లో జగన్మోహన్ రెడ్డి సానుభూతితో గెలవాలని కోడి కత్తితో గీయించుకుని, చంద్రబాబుపైకి నెట్టి, ఆంధ్ర పోలీసులపై తనకు నమ్మకం లేదని జగన్ చెప్పారని అన్నారు. జగన్ ఆడిన డ్రామాలను విచారణ సంస్థ బట్టబయలు చేసిందని చెప్పారు. వివేకాను హత్య చేయించింది టిడిపి అధినేత చంద్రబాబు, ఆపార్టీ నాయకులు చేయించారని మొదట చెప్పాడని ఇప్పుడు వాళ్ళ కుటుంబం సభ్యులపైనే సిబిఐ తేల్చేసరికి ఇప్పుడు ఆస్తి తగాదాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వివేకానంద రెడ్డి హత్య పై సిబిఐ కన్నా మంచి దర్యాప్తు సంస్థతో విచారింప చేయాలని జగన్ చెప్పటం హాస్యాస్పందమన్నారు. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి వివేకానంద రెడ్డికి అక్రమ సంబంధం ఉందని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. హత్య జరిగినప్పుడు కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రక్తపు మరకలు తుడిసి వేసి, నిజాన్ని దాచాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఎలాగైనా గెలవాలని నియోజకవర్గాల వారీగా టిడిపి ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, మేలుకోకపోతే నష్టపోతామని నాయకులను, కార్యకర్తలను ఆయన హెచ్చరించారు. ఎప్పుడు ఎన్నికలకు వచ్చినా 160 స్థానాలు మావే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోవు ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వడం జరుగుతుందని, చివరకు నాకు కూడా అని అధిష్టాన నిర్ణయాన్ని చెప్పారు. ప్రతిపక్షంలో కార్యకర్తలను చేరదీస్తారు, అధికారంలో మారుస్తారన్న భావన కార్యకర్తల్లో ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తేల్చి చెప్పారు. వైకాపా లాగా టిడిపి గాలికొచ్చిన పార్టీ కాదని, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని దెబ్బతీయడం ఎవరి తరం కాదన్నారు. టిడిపి మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇసుక, మద్యం వైకాపా నాయకులకు ఆర్థిక వనరుగా మారిందన్నారు. రాష్ట్రం ఏమైతే నాకేమనే ధోరణిలో జగన్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కష్టమొచ్చే రాష్ట్రాన్ని చంద్రబాబు చేతుల్లో పెడితే బాగు చేస్తారన్న అభిప్రాయంలో ప్రజలు ఉన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డిలు పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన భూమిరెడ్డి శాసనమండలికి పోతుంటే, జగన్ కుటుంబ సభ్యులు జైలుకు వెళుతున్నారని ఎత్తిచూపారు. రైతు సంక్షేమానికి పాటుపడింది తెలుగుదేశం అన్నారు. వైకాపా ప్రభుత్వం వ్యవసాయానికి ఏమి చేసిందని, యంత్రాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. మట్టి, లిక్కర్, సాండ్ మాఫియా పాలన సాగిస్తుందని, వైకాపా ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి నీటిపారుదల, ప్రజా సంక్షేమం గాలికొదిలేసారని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ఒకే ఉక్కు పరిశ్రమకు మూడుసార్లు భూమి పూజ చేసిన ఘనత జగన్ దే అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

గృహనిర్మాణ లక్ష్యాన్ని సాధించండి : కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : పేదలందరికి ఇళ్ళు నిర్దేశిత లక్ష్య సాధన దిశగా ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామ రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ సభా భవన్ నుండి.. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డి ఆర్ ఓ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పి.డి. కృష్ణయ్యాలతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు- పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామ రాజు.. నేరుగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... అర్హత ఉన్న ప్రతి పేద వారికి ఇంటి స్థలం మరియు సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్య మని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు.. ప్రతి ఒక్కరూ.. నిబద్ధతతో పని చేయాలన్నారు. సంబంధిత అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా.. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని.. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్త్రీలతో టై అప్, ఇసుక, ఐరన్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల నదుపా యాలను సమకూర్చి.. నిర్మాణ పలనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. జగనన్న గృహనిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధికమించాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఓలు ధర్మ చంద్రారెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు హాజరయ్యారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలవబడే పుష్పగిరి క్షేత్రంలో మంగళవారం వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి, శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు గణపతి పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం పుట్టమన్ను తీసుకొచ్చి మేదిని పూజ నిర్వహించారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

ఇరువురికి జీవితఖైదు

-పోలీసు అధికారులకు అభినందనలు
- ధన వ్యామోహంతో సొంత మామనే కడతేర్చిన కేసు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన రాయపాటి కిరణ్ కుమార్‌రెడ్డి, పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాసులు రెడ్డి అనే ఇరువురికి జీవితఖైదు విధించడంతో పాటు రూ.11లక్షల వంతున జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరులోని రెండవ అదనపు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. 2019 సంవత్సరంలో ట్రాన్స్‌కోలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రాయపాటి కిరణ్‌కుమార్‌రెడ్డి తన మామ అయిన ఎరమల చెన్నకృష్ణారెడ్డి పేరుపై రూ.కోటికి ఇన్సూరెన్స్ చేయించి కారు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించిన నేపథ్యంలో అప్పటి సీఐ బి.వి.రమణ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ సదాశివయ్య కేసు విచారించి ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ ఎం.మంజునాథరెడ్డి న్యాయస్థానంలో సాక్ష్యులను ప్రవేశపెట్టి ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేశారు. జీవితఖైదుకు గురైన ముద్దాయిలు రూ.11లక్షల వంతున జరిమానా చెల్లించని పక్షంలో 8 సంవత్సరాలు అదనపు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి వెలువరించిన తీర్పులో స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాంప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించగా ముద్దాయిల పక్షాన ఈశ్వర్‌రెడ్డి వాదించారు. అయితే నేరం రుజువుకావడంతో శిక్షను ఖరారు చేశారు. కాగా కేసులో సమర్థవంతమైన దర్యాప్తు చేసి ముద్దాయిలకు శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందిం చారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో - సీఐ మంజునాథరెడ్డి: కేసుకు సంబందించి ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు సాక్ష్యులు ప్రలోభాలకు లోను కాకుండా న్యాయస్థానంలో ప్రవేశ పెట్టడం జరిగిందని ఎర్ర గుంట్ల సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధన వ్యామోహంతో సొంత మామను అంతమొందించడం జరిగిందన్నారు. ముద్దాయిలకు శిక్ష ఖరారు కావడం తమకు తృప్తినిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా ఈ శిక్షలు దోహదపడతాయన్నారు. నేరం చేసిన వారికి శిక్షలు పడడం ద్వారా భవిష్యత్‌లో నేర ఘటనలను నివారించినట్లు అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తుకు కృషి చేసిన ఎస్‌ఐలు వెంకటకృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్‌తో పాటు సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో ఎస్‌ఐ కృష్ణయ్య కూడా పాల్గొన్నారు.

జమ్మలమడుగులో పార్టీకి పూర్వవైభవం తేవాలి
'భూపేష్'కు చంద్రబాబు సూచన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జమ్మలమడుగు అసెంబ్లీ నియోజక వర్గంలో పార్టీకి పూర్వవైభవం తెచ్చే దిశగా గట్టిగా కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డికి సూచించారు. కడపలో మంగళవారం జరిగిన తెలుగుదేశం పార్టీ జోన్-5 సమావేశంలో చంద్రబాబు నాయుడు భూపేష్‌తో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా భూపేష్‌కు అధినేత చంద్రబాబు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నియోజక వర్గంలో గతంలో పార్టీ పటిష్టంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ పూర్వవైభవం దిశగా కార్యాచరణ రూపొందిం చుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం నియోజక వర్గంలో కొనసాగుతున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమ తీరు తెన్నులపై చంద్రబాబుకు భూపేష్ వివరించారు. ప్రజల నుండి వస్తున్న స్పందనను కూడా చంద్రబాబుకు భూపేష్ వివరిం చినట్లు సమాచారం. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ప్రజల మద్దతు పొంది విజయం దిశగా ముందుకు సాగాలని చంద్రబాబు భూపేష్‌కు సూచించినట్లు తెలుస్తోంది. కాగా భూపేష్ వెంట ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డితో పాటు ఆరు మండలాల పార్టీ బాధ్యులు, పురపాలికల బాధ్యులు ఉన్నారు.

ప్రాంతీయపార్టీలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలు: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ, టీడీపీ, జనసేనపార్టీఉ బీజేప చేతిలో కీలుమొమ్మలుగా మారాయని కాంగ్రెస్‌పార్టీ మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో విషయానికి వస్తే బి అంటే బాబు, జె అంటే జగన్, పీ అంటే పవన్ అని అర్థమన్నారు. ఈ మూడు పార్టీలకు ఓటువేస్తే బీజేపీ కి ఓటు వేసినట్లే నన్నారు. లిబీజేపీ రాష్ట్రానికి నెంబర్ 1దుష్మన్ అన్నారు. ప్రత్యేక హోదాకి పంగానామాలు పెట్టిందని, ప్రత్యేక ప్యాకేజికి తిలోదకాలు ఇచ్చిందన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ కి స్వస్తి పలికిందని, పోలవరాన్ని ప్రశ్నా ర్థకం చేసిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని అమ్మకానికి పెట్టిందని, వైకాపా, టీడీపీ, జనసేన పార్టీ లు బీజేపీ ప్రాపకం కోసం తెగ ఆరాట పడుతున్నా యన్నారు. ప్రాంతీయ పార్టీ లకు ప్రత్యేక హోదా ఇచ్చే శక్తిలేదు, తెచ్చే శక్తి లేదన్నారు. కానీ పెళ్ళింటి కాడ కుక్కలు సందడి చేసినట్టు తామే రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్టు తెగ గోల చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రతేక హోదా రావాలన్నా ,చట్టం లోని అంశాలు అమలు కావాలన్నా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ఈ విషయం ప్రజలు బాగా ఆలోచించుకోవాలని తెలిపారు.

కాలువ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం పంచాయతీలో మైలవరం కాలువను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజికవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ నజీర్‌ఆహ్మద్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ప్రొద్దుటూరు మండలం పొట్టిపాడు రోడ్డు బైపాస్ రోడ్డు నుండి రూరల్ పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న మైలవరం కాలువపై ఆయా ప్రదేశాలలో ఉండే వైకాపా నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని కాలువను పూడ్చివేసి కాలువపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అక్రమ నిర్మాణాలకు పంచాయతీ, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు అవినీతికి పాల్పడి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టవేయలేని పరిస్థితి అన్నారు. మైలవరం కాలువకు ఇరువైపుల కాలువ పూడిక తీసేందుకు రస్తా ఉండేద న్నారు. కాలువను పూడ్చివేసి రస్తాను సైతం ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దశల వారీగా ఆందోళన చేయవలసి వస్తుందని వినతిని తహసీల్దార్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభు త్వంలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడం జరుగు తుందని సోమిరెడ్డిపల్లె సర్పంచ్ రామయ్య పేర్కొన్నారు. మంగళ వారం సర్పంచ్ రామయ్య, వైకాపా కన్వీనర్ జోగయ్యతో సోమిరెడ్డి పల్లె పంచాయతీ సచివాలయం-1, 3లోని జింకల నగర్, సుగాలి తాండ గ్రామాల్లో పర్యటించి జగనన్నే మా భవిశ్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం గురించి ప్రజలకు వివరిం చారు. అనంతరం వారు గోడపత్రాలు, స్టిక్కర్స్‌ను గ్రామ ప్రజలకు పంపిని చేశారు. ఈ కార్యక్రమాంలో సచివాలయం వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త సీఎం జగన్

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : భారతదేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు సృష్టించి ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందే విధంగా వాలంటీర్ వ్యవస్థను సృష్టించి దేశానికే ఆదర్శమైన ముఖ్యమంత్రి మన జగన్‌మోహన్‌రెడ్డి అని గంగపేరూరు సర్పంచ్ కూండ్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. మంగళ వారం ఒంటిమిట్ట మండలంలోని గంగపేరూరు గ్రామంలో జగనన్న మీరే మా భవిష్యత్ మా నమ్మకం అన్న కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న చేస్తున్న పథకాల అమలు తీరు తెలిపి మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం నుండి ఏదైనా పథకాలు అందుతున్నాయా లేదా అని అందరినీ అడిగి తెలుసుకున్నారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆయన జోష్యం చెప్పారు. ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని ఇవి కేవలం కల్పితమేనని అబూత కల్పన మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారే తప్ప జగనన్న పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం వచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, పోలి ఎరికలరెడ్డి, ఆర్‌ఎం సుబ్బారెడ్డి, మామిడి మనోహర్‌రెడ్డి, కూండ్ల చంద్రారెడ్డి, గృహ సారథులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



బీజేపీని గద్దె దింపుతాం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మతోన్మాద శక్తులను అరికట్టలేని బీజేపీని గద్దె దింపుతాం అంటూ పట్టణంలోని నేతాజినగర్ 4వ వీధిలో సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ 9ఏళ్ల కాలంలో మతోన్మాద శక్తులు, కవులు, రచయితలను, మేధావులైన జర్నలిస్టు గౌరీ లంకేష్‌ను, గోవింద్ పన్సారీలను, కల్బుర్గిలను చంపారని ఇంతవరకు ప్రధాని మోడి ఖండించలేదన్నారు. ఇక దేశంలో మేధావులకు, అభ్యుదయవాదులకు తావు లేదనే హెచ్చరికలు కనిపిస్తున్నాయని వాపోయారు. వామపక్ష వాద శక్తులపై వారి కార్యాలయాలపై దాడులు చేస్తున్న ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్‌లను బ్యాన్ చేయాలని వారు డిమాండ్‌చేశారు. బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలను రాబోవు ఎన్నికల్లో తిప్పికొట్టాలని, లౌకికవాద శక్తిని చాటాలని వారు ప్రజలకు విన్నవించాలని వామపక్షాల ప్రచార పోరు కరపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ సహాయ కార్యదర్శి షరీఫ్, ఏఐవైఎఫ్ సురేష్, సీఐటీయూ ఓబులేసు, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - కమలాపురం : నగరంలోని అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయం నందున విద్యార్థినీలకు బహుమతులు కమలాపురం మలేరియా అధికారి నాగలక్ష్మి రెడ్డి అందజేశారు. జిల్లా మలేరియా అధికారిని మనోరమ్మ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్న ప్రపంచంలో మలేరియా దినోత్సవంలో భాగంగా ఆ కళాశాల చెందిన విద్యార్థునీలకు ముందుగా క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఉపాధ్యాయురాలు ఏఎన్ఎం అరుణ ఆశా కార్యకర్త జోష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ర్యాలీ

విశాలాంధ్ర-వేంపల్లె: టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవికి గన్‌మేన్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వేంపల్లెలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనరు రామమునిరెడ్డి తెలిపారు. ఇటీవల బీటెక్ రవికి నియమించిన గన్‌మేన్లను వెనక్కిరావాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో గన్‌మేన్లు ప్రభుత్వ ఆదేశాలు పాటించారన్నారు. హఠాత్తుగా బీటెక్ రవికి గన్‌మేన్లను తొలగించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, ర్యాలీకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం గండిక్షేత్రంలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్ నగరం తార్నాకకు చెందిన బద్దం దుగ్గిరెడ్డి రాజ్యలక్ష్మి, కరుణాకర్‌రెడ్డి దంపతులు రూ.50116లు విరాళం ప్రకటించినట్లు ఆలయ అసిస్టెంటు కమిషనరు ముకుందరెడ్డి తెలిపారు. ఆ మేరకు మొత్తాన్ని శనివారం గండిక్షేత్రంలో చెక్కురూపంలో తనయు అందజేశారన్నారు. దాతలకు ప్రత్యేక దర్శనంతో పాటు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

విశాలాంధ్ర-లింగాల: స్థానిక మండల పరిషత్ సమావేశంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. తిరిగి మండల సమావేవం ఎప్పుడు నిర్వహించే విషయం త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

టీడీపీ జోనల్ మీటింగులో పాల్గొన్న పుట్టా

విశాలాంధ్ర - మైదుకూరు : కడపలో తెలుగుదేశం పార్టీ జోనల్ మీటింగ్‌లో పాల్గొన్న టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని శాలువాతో ఘనంగా సత్కరించిన మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ అనంత రం పెద్ద దర్గా నందు ఇఫ్తార్ విందులో నారా చంద్రబాబు నాయుడుతో పాల్గొన్నారు.

కొప్పర్తిలో వైవియు విద్యార్థుల సేవలు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ -1 వాలంటీర్లు కొప్పర్తిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.సరిత పర్యవేక్షణలో కొప్పర్తి గ్రామ వీధులను శుభ్రం చేశారు. కడప పులివెందల ప్రధాన రహదారి ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. బస్సు షెల్టర్‌లో ప్రయాణీకులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కలిగించారు. దారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. విద్యార్థుల సేవా కార్యక్రమాలను విశ్వవిద్యాలయ ఉప ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్, వైవియు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. వెంకటరామిరెడ్డి పరిశీలించి అభినందించారు. మంగళవారం నిర్వహించిన సేవా కార్యక్రమాలను ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి.సరిత ప్రిన్సిపల్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లాలో రెచ్చిపోతున్న భూమాఫియా

కబ్జాదారుల కొమ్ముకాస్తున్న తహసిల్దార్లు : సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : అర్హులైన పేదలకు సాగు భూమి పంపిణీ చేసేందుకు అసైన్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించకుండా అడ్డగోలుగా అధికార పార్టీకి చెందిన నేతలు జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్న భూమాఫీ యా అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, అరికట్టాల్సిన తహసిల్దార్లు కబ్జాదారుల కొమ్ముకాస్తున్నా రని త్వరలో పూర్తి వివరాలను బహిర్గతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల ఇంటిస్థలం, రెండెకరాల సాగు భూమి పంచడానికి నిరాకరిస్తున్న అధికారులు, అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు రెవిన్యూ రికార్డుల ఆధారంగా విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, దేవాదాయ, భూదాన, ఇనాం, వక్స్, అసైన్మెంట్ భూములపై తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నా రని విమర్శించారు. గతంలో దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో అసైన్మెంట్ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించి ఎమ్మెల్యే నేతృత్వంలో ఆర్.డి.ఓ, ఎమ్మార్వో, గుర్తింపుపొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి అర్హులైన పేదలకు రెండెకరాల సాగుభూమి పంపిణీ మినహా గత 12ఏళ్లుగా అసైన్మెంట్ సమావేశాలకే నోచుకోలేదన్నారు. దశాబ్దాల తరబడి సాగులో ఉన్నప్పటికీ పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడం స్థానిక అధికారపార్టీ నేతల ప్రోద్బలంతో తహసిల్దార్లకు భారీ నజరానాలు ముట్టజెప్పి తమ పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటున్నారన్నారు. అసైన్మెంట్ ఆక్ట్ ప్రకారం అసైన్మెంట్ కమిటీలో ఆమోదం పొంది, డి.కె.టి పట్టాతో పాటు పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతు అమ్మడం, కొనడం చెల్లదని ఉన్నప్పటికీ భూఆక్రమణదారులు యదేచ్ఛగా క్రయ, విక్రయాలు కొనసాగిస్తున్నారన్నారు. పేదవాడు విదిలేక జానెడు జాగాలో గుడిసె వేసుకున్నా, రెండెకరాలు గుట్టపొరంభోకు సాగుచేసుకున్నా ఆగమేఘాల మీద తహసిల్దార్లు, పోలీసులు వచ్చి అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపుతున్నారని అదే భూములను కొంతమంది పెద్దమనుషులు రెండెకరాలు పట్టాభూమి కొనుగోలు చేసి చుట్టూ ఉన్న ప్రభుత్వ వంక, చెరువు పొరంబోకు 10 ఎకరాలను ఆక్రమించి కంచెవేసి సోలార్ పెన్సింగ్‌తో ఎస్టేట్లో ఏర్పాటు చేసుకున్నా అటువైపు కూడా తహసిల్దార్లు గాని, పోలీసులు గాని వెల్లకపోవడం విచారకరమన్నా రు. సీఎం వైఎస్ జగన్ జీవో 22 ఏ సవరణ చేయడం వల్ల అమ్ముకోవచ్చు అనే ప్రకటన భూకబ్జాదారుల అక్రమాలకు రెక్కలొచ్చా యన్నారు. భవిష్యత్లో అసైన్మెంట్ భూములను, డికెటి భూములను అమ్ముకోవచ్చు కొనుక్కోవచ్చు రిజిస్టర్ అవుతాయని నమ్మబలుకుతూ యదేచ్ఛగా ఆక్రమిస్తున్నారన్నారు. భూముల ఆన్లైన్ విధానం వచ్చిన తరువాత రైతులకు అధికారుల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గుతాయిని అనుకున్నప్పటికీ అధికారుల వైఖరి వల్ల తిప్పలు రెట్టింపు అయ్యాయన్నారు. భూముల ఆన్లైన్ పేరుతో ఒకరి భూమి మరొకరికి నమోదు చేసి సరిదిద్దాలంటే సదరు రైతు వచ్చి వ్రాతపూర్వకంగా ఒప్పుకున్న తరువాతనే భూమి నమోదులో తప్పులను సరిదిద్దుతామని చివరకు భూమి విలువను బట్టి మామూళ్ళు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆన్లైన్ నమోదులో ఉద్దేశపూర్వకంగానే తప్పులు చేసి అడ్డగోలుగా దొరికిపోయి చివరికి రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో సస్పెండ్ అయ్యిన తహసిల్దార్లను తిరిగి అదేస్థానంలో తీసుకువచ్చేందుకు కూడా ఎమ్మెల్యేలు వెనకాడడం లేదంటే ఎంత పెద్దఎత్తున భూదందా నడుస్తున్నదో అర్థమవుతుందన్నారు. కొంతమంది తహసిల్దార్లు, పోలీసులు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ కోట్లు గడిస్తున్నారని ఈక్రమంలో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా లేఔట్లు వెలుస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఒక లేఔట్ వేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి సలభై శాతం భూమి రోడ్లు, కాలువలు, పార్కులు, పాఠశాలలు, కమ్యూనిటి డెవలప్మెంట్కు కేటాయించాలని అందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్కు రెవిన్యూకు డబ్బుచెల్లించి దరకాస్తు చేసుకుంటే భూమి స్వభావాన్ని మార్చే క్రమంలో సదరు భూమి మునకకు గురవుతుందా లేక పర్యావరణ సమతుల్యతకు ముప్పు వాటిల్లుతుందా వంటి విషయాలను పరిగణలోకి తీసుకోవాలి కానీ అధికార, రాజకీయ అండదండలతో నిబంధనలను అతిక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. భూమాఫియా పై చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు సమాయత్తమవుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జి. వేణుగోపాల్, కెసి బాదుల్లా, గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు

బ్రాహ్మణుల శ్రేయస్సు టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమం, శ్రేయస్సు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు. జోన్ 5 సమావేశానికి విచ్చేసిన అయన నగరం లోని సమైక్య బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు డా. గోపినాథ్, ఆడిటర్ శివరావు, అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్, ఇతర సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా తెలుగుదేశం పార్టీ లో బ్రాహ్మణ సాధికార కమిటీని తెదేపా అధినేత చంద్రబాబు నియామకం చేపట్టారని, ఈ కమిటీ ద్వారా వెనుకబడిన బ్రాహ్మణ సమాజంలోని పేదల అభివృద్ధి, సంక్షేమం ఫలాలను మెరుగ్గా అందించేందుకు వారి సమస్యలను తెలుసుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే కృషి చేస్తామని తెలిపారు. గత తెలుగుదేశం పాలనలో చంద్రబాబు బ్రాహ్మణులకు బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి సంక్షేమపథకాలను విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు. అనంతరం బుచ్చి రాంప్రసాద్‌ను సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు. సమావేశంలో కడప పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్, టిడిపి జిల్లా లీగల్ సెల్ అధికార ప్రతినిధి ఆదినారాయణ, సమాఖ్య ప్రతినిధులు బాలకృష్ణ, బాలాజీ, మునిరామ చంద్ర రావు, శంకర నారాయణ, సుధీర్, శాస్త్రి, లక్ష్మి దేవి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బృందం సేవలు అభినందనీయం: చైర్మన్ వరప్రసాద్

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పాలిసెట్, ఏపీ ఆర్జేసీ ప్రవేశ పరీక్షలకు సంబంధించి స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఉపాధ్యాయ బృందం అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో నిర్వహిస్తున్న పాలీసెట్, ఏ పి ఆర్ జె సి సెట్ లకు ఉచిత శిక్షణ తరగతులను ఆయన ఎంఈఓ వీరారెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఉచిత శిక్షణ సంబంధించిన స్టడీ మెటీరియల్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం నిస్వార్థంగా చేస్తున్న సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. విద్యార్థి దశలో తలదించుకుని పుస్తక పఠనం చేస్తారో ఆ విద్యార్థి జీవితాంతం తలెత్తుకుని జీవిస్తారనానరు. భవిష్యత్‌లో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్వహిస్తున్న అన్ని శిక్షణ కార్యక్రమాలకు శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసి సేవాసమితికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. పేద విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఎంతో ఉన్నత ఆశయాలతో ఉచిత శిక్షణకు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖధికారి వీరారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి 10 వ తరగతి తరువాత మొట్టమొదటి సారి వచ్చే ఈ పోటీ పరీక్షలు చాలా కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్ కి ఇక్కడ నుండే పునాది పడుతుందని, కావున ప్రతి ఒక్కరు ఉచిత ఉపాధ్యాయ బృందం అందించే జ్ఞానాన్ని అందుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఉత్తమ పౌరులుగా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి జగన్ వల్లే సాధ్యం

విశాలాంధ్ర - వల్లూరు : ప్రజల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వల్లే సాధ్యమవుతుందని వైయస్సార్ జిల్లా అధికార ప్రతినిధి బూసి పాటి కిషోర్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వల్లూరు లో జగనన్న భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై ప్రజలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లలో ప్రజల కోసం చాలా అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిందని ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ప్రజలకు వివరించారు. అలాగే ఈసారి కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బూసిపాటి బాలచంద్ర, బి.కరుణాకర్ ,ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

విశాలాంధ్ర-వేంపల్లె: మతోన్మాద బీజేపీని సాగనంపుదామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. మతోన్మాద బీజేపీ వ్యతిరే క విధానాలపై సిపిఐ ,సిపిఎం ఆల్ ఇండి యా కమిటీల పిలుపుమేరకు ప్రజా పోరు యాత్ర లో భాగంగా మంగళవారం వేంపల్లి అడ్డరోడ్డు కూడలి నుంచి బస్టాండ్ ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సభ్యులు కడప జిల్లా కార్యవర్గ సభ్యులు పులివెందుల ఏరియా ఇన్చార్జ్ కామ్రేడ్ సి సుబ్రహ్మణ్యం, కడప జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా జీవితాలతో చెలగాటమాడుతూ నిత్యావసర సరుకులు ధరలు పెంచుకుంటూ పేద మధ్యతరగతి జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన హామీలైన ప్రత్యేక హోదా, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై స్పష్టత లేకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేకాక వేల కోట్ల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా దోచిపెడుతున్నాయని, రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయలేని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లరూపాయలు రుణమాఫీ చేస్తుందని విమర్శించారు. పేదలకు సామాన్యులకు అండగా ఉండటం పోయి కంపెనీలను ధార దత్తం చేస్తుందని ఇప్పటికైనా ప్రజలు కళ్ళు తెరిచి మోడీని మోడీ మద్దతు ప్రభుత్వాలను గద్దె దించడానికి కంకణం కట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి భాష, బ్రహ్మం వేంపల్లి మండల నాయకులు జకరయ్య, అంజనప్ప, తొండూరు మండల కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు నిరసన సెగ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ దళిత నేత ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. నల్ల బ్యాడ్జీలు, నల్ల జండాలతో కాన్వా య్ వెళ్లే మార్గంలో నిరసన. దళితులను కించపరిచేలా మాట్లాడిన లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశి విద్య వల్ల దళితులు పీకిందేమి లేదు చేసిందేమీ లేదని లోకేష్ వ్యాఖ్యలు. గతంలో దళితుల పట్ల చంద్రబాబు వ్యాఖ్యలు, తాజాగా లోకేష్ వ్యాఖ్యలతో దళితుల మనస్తాపం చెందారని దళితులకు క్షమాపణ చెప్పిన తర్వాతే చంద్రబాబు జిల్లాకు రావాలని డిమాండ్ చేశారు. దళిత నేతలను వినోద్ మరియు సునీల్ కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. పోలీసులకు నిరసన కారులకు మధ్య తోపులాట జరిగింది. సుబ్బారెడ్డి, చెన్నయ్య, త్యాగరాజు, బండి బాబు, కె.బాబు, సంపత్, చైతల్యా దత్త సాయి, జస్వ, చైతన్య, గరుడాద్రి, తులసమ్మ, సుశీలమ్మ, జ్యోతి మరియాలు, లక్ష్మి నారాయణ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ విజయం తథ్యం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. మంగళవారం దక్షిణ భారతదేశంలోనే అత్యంత అద్భుత కట్టడమైన కోదండ రామాలయాన్ని వారు సందర్శించారు. వారికి టీడీపీ కార్యకర్తలు, ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరికి ప్రధాన అర్చకులు ఆలయ విశిష్టత, స్థల పురాణం వివరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రామాలయ అభివృద్ధికి టీడీపీ ఎనలేని కృషిచేసిందని ఈ రామాలయాన్ని తితిదేవస్థానంలో కలిపిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. తితిదే నుంచి ఈ రామాలయ అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వందకోట్లు కేటాయించి ఈ రామాలయా నికి ఎనలేని కృషి చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. నేడు బ్రహ్మోత్సవాలు జరిగినా మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాకపోవడం తగదన్నారు. ఒంటిమిట్ట మండలంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని ఆయన కార్యకర్తలను అభినందించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ విజయదుందుబి మోగించి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మోదగల నరసింహులు, ఉన్నం కిరణ్‌స్వామి, లాయర్ ఆదినారాయణ, బొబ్బిలి, మీనుగ వెంకటరమణ, మౌలాలి, కొండమాచుపల్లె మాజీ సర్పంచ్ శ్రీహరి, మామిళ్ల ఈశ్వరయ్య, లాయర్ రామదాసు, పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువు, జ్ఞానంకు మించిన ఆస్తి మరొకటి లేదు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలురు, బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, ఆర్సీఎమ్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలను మంగళ వారం సందర్శించి అక్కడ చదివే విద్యార్థులతో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి సమావేశమై విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకోవడానికి ప్రేరణాత్మకమైన సందేశాన్ని ఇచ్చారు. ఇందులో ప్రధానంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు జ్ఞానం గురించిన ఆస్తి మరొకటి లేదని ఈ సమాజంలో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువు జ్ఞానమే మార్గాలని ఆ చదువును ఏకాగ్రతతోటి ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని ఆ లక్ష్యసాధన కోసం శ్రమ పట్టుదల సాధనలను ఆయుధాలుగా మల్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రతి విద్యార్థి విద్యార్థి దశనుండే చదువుతోపాటు ఆటలు, పాటలు, మాటలు మరియు సంగీతం సాహిత్యం పైన అవగాహన పెంపొందిం చుకొని పరిపూర్ణమైన విద్యార్థులుగా తయారయ్యి భవిష్యత్తులో భావితర పౌరులుగా మరియు సమాజ నిర్దేశకులుగా తయారు కావాలని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకొని మీరు చదివిన పాఠశాలకు మీరే ముఖ్యఅతిథిగా విచ్చేసే రోజులు రావాలని ఆయన తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం కృషి చేసినప్పుడు విజయం మిమ్మల్ని వరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిఆర్‌పి నాగమణి పాల్గొన్నారు.

23వ వార్డు మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని 23వ వార్డులోని మహిళలకు రంజాన్ పండుగను పురస్కరిం చుకొని వార్డు కౌన్సిలర్ వడ్ల ఖలీలుల్లా, వడ్ల దాదాపీర్ ఆధ్వర్యంలో చీరలను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మహిళలకు పంపిణి చేశారు. అనంతరం వార్డులోని కొన్ని ఇళ్లకు నువ్వే మా నమ్మకం జగనన్నా అనే స్టిక్కర్లను ఎమ్మెల్యే స్వయంగా గోడలకు అంటిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడు తూ వార్డు కౌన్సిలర్ వడ్ల ఖలీలుల్లా వారి తండ్రి వడ్ల దాదాపీర్‌లు ప్రతి ఏడాది రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వార్డులోని ప్రజలకు ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారని కొనిఆడారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని వార్డులోని 900మంది మహిళలకు రూ.1000విలువ చేసే చీరలను పంపిణి చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమాలే కాకుండా మసీదుకు సౌకర్యాలు, వంట పాత్రలు గతంలో అందించారన్నారు. సేవా కార్యక్రమాలలో వడ్ల దాదాపీర్ కుటుంబం పాలుపంచుకోవడం వార్డు ప్రజలకు అందు బాటులో ఉండటం, సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో సేవలు అందించాలని కోరారు.

చంద్రబాబుకు ఘణస్వాగతం పలికిన నేతలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కడపలో జరిగే జోన్-5 క్లస్టర్ ఇంచార్జ్ విస్తృతస్థాయి సమా వేశానికి హాజరైన టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు కడప ఎయిర్‌పోర్టులో టీడీపీ నాయ కులు ఘనంగా స్వాగతం పలికారు. కడప జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డిని కలిసి ఘనంగా స్వాగతం పలికారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈ.లక్ష్మీనారాయణ ఎన్నిక హర్షనీయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏపీఎస్‌పీ డీసీఎల్ (డిస్కం) కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఈ.లక్ష్మీనారాయణ ఎన్నిక కావడం పట్ల ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ హెచ్64 (ఏఐటీయూసీ అనుబంధం) ప్రొద్దుటూరు డివిజన్ కమిటీ హర్షం వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి వై.ఆదినారాయణరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం కాంట్రాక్టు కార్మికులు, పర్మనెంట్ ఉద్యోగులు, జేఎల్ఎం గ్రేడ్-2 లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వారి ప్రతినిధిగా నిబద్ధతతో పోరాడే వ్యక్తి ఈ లక్ష్మీనారాయణేనని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడాన్ని అడ్డుకునే సత్తా ఒక్క ఏఐటీయూసీకే ఉందని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. పీఆర్సీ, డీఎలు ఇవ్వకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడం ప్రభుత్వ మొండితీరుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జేఎల్ఎం గ్రేడ్-2లకు నేటికీ ప్రొబిషన్ డిక్లరేషన్ చేయకపోవడం సచివాలయ ఉద్యోగులతో పాటు సమాన హక్కులను కల్పించకపోవడం విద్యుత్ సంస్థల పాత సర్వీసు రూల్స్‌ను అమలు చేయకపోవడంతో జేఎల్ఎం గ్రేడ్2లు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తుచేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పరిష్కరించాలన్నారు. ఇవేకాకుండా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయని ముఖ్యంగా పని ఒత్తిడి అధికమై మనోవేదనకు గురవుతున్నారని గుర్తుచేశారు. కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మొండిగా వ్యవహరించడం తగదన్నారు. విద్యుత్‌రంగ ఉద్యోగులు, కార్మికులు సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో లక్ష్మీనారాయణలాంటి వారు ప్రధానమైన నాయకత్వానికి ఏకగ్రీవ ఎన్నికకావడం కార్మిక లోకానికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. లక్ష్మీనారాయణ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి కార్మికుల పక్షాన పనిచేయాలని ఆయన అభినందించారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



టీడీపీ కార్యకర్తను పరామర్శించిన సుగవాసి

విశాలాంధ్ర-గాలివీడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బండి అనీల్ రెడ్డిని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు మంగళవారం పరామర్శించారు. గోరాన్ చెరువు గ్రామం బండివాండ్లపల్లెకు చెందిన టిడీపీ సీనియర్ కార్యకర్త బండి నాగిరెడ్డి కుమారుడు అనీల్ రెడ్డి వారం రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదం లో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న అనీల్ రెడ్డి ని కలసిన సుగవాసి ప్రసాద్ బాబు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఎప్పుడు ఎలాంటి సహాయం అవసరమైన తన దృష్టికి తెస్తే కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తానని భరోసా కల్పించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పీలేరు: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 5వ రోజు పీలేరు , తిరుపతి రోడ్ లో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నందు అక్కడ పనిచేసే సిబ్బంది ఆయిల్ ఫైర్స్ పై అవగాహన సదస్సు మరియు వివిధ రకాల ఫైర్స్ అయితే ఎలా నివారించాలి అని డెమో రూపములో చూపించడమైనదని పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి డి.సుబ్బారాజు తెలిపారు. ఈకార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి డి.సుబ్బారాజు ,మరియు బి . శ్యాం ప్రకాష్ , కే. నాగి రెడ్డి , యాన్ . హేమాద్రి రెడ్డి,, జి కృష్ణ మూర్తి , కే శ్రీనివాసులు , యం. వెంకటేష్ , యస్ . వెంకట రమణ , ఏ. రెడ్డి శేఖర్ , టి. షఫీ , యస్. షకీల్ నవాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

గత నాలుగు రోజులుగా కాలుతున్న అడవులు

విశాలాంధ్ర-చిట్వేలి : మండలంలోని రాజుగుంట చేర్లో పల్లి గ్రామాల రాపూరు ఘాట్‌లోను అటవీ ప్రాంతంలో గత నాలుగు రోజులుగా తీవ్ర మైన అగ్ని కీలకలలతో అడవి మండుకుంటుంది. వేసవి కాలం కావడం తో సాయంత్రం పూట ఎక్కువగా మంటలు చెలరేగుతున్నాయి. ఈ అటవీ ప్రాంతంలోఎంతో విలువైన ఎర్రచందనం చెట్లు ఎక్కువగా ఉన్నాయి. అవి ఈ మంటల్లో జంతు జీవరాశులు మంటలకు అహుతవుతున్నాయి. అటవీ అధికారులు ఈ మంటలు ఆర్పడానికి కొన్ని చెట్ల మండలను పోగుచేసి ఆ మండల ద్వారా మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. సిబ్బందికి కాళ్ళకు బూట్లు చేతులకు గ్లౌసులు చెట్ల ద్వారా పోగుచేసిన కొమ్మల ద్వారా మంటలు ఆర్పడానికి చాలా కష్ట తరంగా ఉందని పగలు ఉష్ణోగ్రత ఎక్కవ ఉండడం వల్ల పగటి పూట మంట. అర్పడాని కష్టంగా ఉందని రాత్రి పూట మంటలను ఆర్పడానికి వీలుగా ఉంటుందని సంభందిత అధికారులు స్పందించి మంటలు ఆర్పడానికి మెరుగైన సదుపాయాలను కల్పించాలని అటవీ అధికారులు మరియు మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: వరంలా ముఖ్యమంత్రి సహాయనిది ఉపయోగపడుతోందని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.ముఖ్యమంత్రి సహాయనిది క్రింద మంజూరైన రెండు చెక్కులను లబ్ధిదారులకు శ్రీకాంత్ రెడ్డి అందచేశారు.సంబేపల్లె గ్రామానికి చెందిన షేక్ బాష కు రూ 2 50 లక్షలు, గాలివీడు మండలం కొర్లకుంట గ్రామం నాయునివారిపల్లెకు చెందిన మిట్ట పల్లె మహేంద్ర రెడ్డికి రూ 75 వేలు చొప్పున మంజూరు అయిన చెక్కులును శ్రీకాంత్ రెడ్డి అందచేసారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి,సర్పంచుల సంఘ అధ్యక్షుడు చిదంబర్ రెడ్డి, మాజీ జెడ్ పి టిసి గొర్ల ఉపేంద్రా రెడ్డి,మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచులు అంచల రామచంద్ర, వెంకట రమణ నాయక్, ఎంపిటిసిలు భద్రయ్య, శ్రీధర్ రెడ్డి,మాజీ సర్పంచ్ దేవపట్ల వెంకట్రామిరెడ్డి,నూర్ అహమ్మద్ పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

విశాలాంధ్ర-రామాపురం : రంజాన్ సందర్భంగా మండలంలోని నీలకంతరావుపేటకు చెందిన అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ మంగళవారం నీలకంతరావుపేటలో పేదలకు 200 చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కతీఫ్ బెగ్ , ముజావర్లహక్కు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ రెడ్డి గంగాధరరావును మంగళ వారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. దళితులు, బడుగు బలహీనర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వెంటనే స్పందించి తగు న్యాయం అందించాలని కోరగా అందుకు అనుగుణంగా ఎస్పీ గారు సానుకూలంగా స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్ మాదిగ, మారుతి శంకర్ శ్రీరాములు పాల్గొన్నారు.

జన సురక్ష పథకాలపై..
గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలో "జన సురక్ష" పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'జిల్లాలో గ్రామస్థాయి జనసురక్ష' కార్యక్రమం అమలులో భాగంగా ఎల్డిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశా నుసారం జిల్లాలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా పిఎంజెజెబీవై, పిఎంఎస్బివై పథకం ప్రయోజనాలపై ఏప్రిల్ ఒకటి నుండి జూన్ 30 వరకు మూడు నెలల పాటు జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. ఈ పథకం గ్రామస్థాయి వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. అనుకోని సంఘటనలు, ప్రమాదాలలో మృతి చెందినా లేదా గాయపడితే పరిహారం అందుతుందన్నారు. పిఎంజెజెబీవై క్రింద 18-50 సంవత్సరాల వయసు గలవారు అర్హులని, వార్షిక చందా 436 రూపాయలు కడితే ఎలాంటి మృతి సంభవించినా రూ.2లక్షలు పరిహారం అందుతుందన్నారు. అలాగే పిఎంఎస్బివై క్రింద 18-70 సంవత్సరాల వయసు గలవారు అర్హులని, వార్షిక చందా కేవలం 20 రూపాయలు కడితే ప్రమాదంలో మృతి చెందినా లేదా పూర్తి అంగవైకల్యం కలిగితే రూ.2లక్షలు పరిహారం, పాక్షిక వైకల్యం ఏర్పడిన వారికి రూ.ఒక లక్ష వరకు పరిహారం అందుతుందన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామస్థాయిలో పిఎంజెజెబీవై, పిఎంఎస్బివై క్రింద ఎక్కువ మందిని నమోదు చేయాలని చెప్పారు. ఇందుకు బ్యాంకర్లకు, అధికారులకు అప్పగించిన బాధ్యతలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం... తరచూ డి.ఎల్.సి.సి సమావేశాలు నిర్వహించాలని, వాటి నిర్వహణకు వివిధ బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని ఎల్డిఎం ను ఆదేశించారు. బ్యాంకుకు కేటాయించిన ప్రదేశాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని, రెండు స్కీమ్‌ల క్రింద ఉన్న అన్ని దరఖాస్తులను మే 31 వరకు స్వీకరించి జూన్ 1 నుంచి ప్రీమియం డెబిట్ చేయడం ప్రారంభించాలని బ్యాంకు కంట్రోలర్లకు సూచిం చారు. గ్రామ పంచాయితీలో పంచాయతి అధికారులతో సహా ఫ్రంట్ లైన్ సిబ్బంది భాగస్వామ్యం వహించాలని, కార్యక్రమం విజయవంతం కావడానికి బ్యాంకు అధికారితో గ్రామపంచాయతీ సిబ్బంది, ఎస్హెచ్జి సభ్యులు మరియు ఇతర స్థానిక ప్రజల నుండి పిఎంజెజెబీవై, పిఎంఎస్బివై దరఖాస్తుల సేకరణలో క్రియాశీల భాగస్వామ్యాన్ని, సమన్వయం చేయాలని, ఎంపీడీవోల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని డిఆర్డిఏ పిడి, డిపిఓ లను ఆదేశించారు. ప్రతి పంచాయతీలో బ్యాంకు క్యాంపులు నిర్వహించేలా సమన్వయం చేయాలన్నారు. అలాగే సచివాలయం వారీగా లక్ష్యాన్ని కేటాయించాలన్నారు. జిల్లాలో ఈ పథకాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి సత్యనారాయణ, డిపిఓ ధనలక్ష్మి, ఎల్ డి ఎం వెంకటేశ్వరరెడ్డి, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని వైసీపీ నాయకులు: సీపీఐ

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: సిపిఐ సిపిఎం ప్రచాం భేరి కార్యక్రమం 5వ రోజు ఎన్టీఆర్ సర్కిల్ నుండి ప్రభుత్వా సుపత్రి వరకు కరపత్రాలు పంచుతూ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కృష్ణప్ప మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో ఆర్థిక అరాచకాలను కొనసాగిస్తుందని మతం పేరుతో రాజకీయాలు నడుపుతూ రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారని, మతం ప్రాతిపదికన రాజకీయాలు నడుపుతూ ప్రజల్లో అంతరాలను సృష్టిస్తుందని, మతం ప్రాతిపదికన చట్టసభలలో బిల్లులు తీసుకొస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి సిపి ప్రభుత్వం కూడా బిజెపి మత తత్వ విధానాలకు మద్దతు పలుకుతుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రాష్ట్రానికి ఒక్క ప్రయోజనం కూడా జరగలేదని,ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిందని కేవలం అప్పులు చేసి కుప్పలు పెట్టే పద్ధతుల్లో రాష్ట్రాన్ని జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. మదనపల్లి మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అనధికార లేవుట్లు నిర్మిస్తూన్నా అడ్డుకోవాల్సిన అధికారులు డబ్బులకు అమ్ముడుపోతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి కే మురళి , సిపిఐ నాయకులు తిరుమల,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న మోడీని సాగనంపుదాం : సీపీఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పేదలపై భారాన్ని మోపి కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న మోడీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య , సిపిఎం నాయకులు సిహెచ్ చంద్ర శేఖర్ పిలుపు నిచ్చారు. బిజెపి హఠావో దేశ్ బచావో నినాదంతో సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రచారభేరి కార్యక్రమం మంగళవారానికి 5 రోజుకు చేరుకుంది.బాలిరెడ్డిపల్లి పంచాయితీ నుండి ఇంద్రానగర్, తిరుగుడుపల్లి, వైకోట, అద్దెపల్లి ఎస్టీ కాలనీ, చలంపాలెం, కొర్లకుంట రైల్వే గేట్ వరకు ప్రచారభేరి కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగింది. మోడి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్య వ్యవస్థలన్ని ధ్వంసం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా డిహెచ్ పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షులు మోడి శివయ్య,సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి నాగమ్మ, సిపిఎం నాయకులు హరి, పెంచలయ్య, జయరామయ్య పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-పీలేరు:పీలేరు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఈనెల24న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహబూబ్ బాష ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లోని 24న జింఖాన గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభలో పీలేరు నియోజకవర్గం నుంచి మరియు అన్నమయ్య జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మైనార్టీ సెల్ విభాగం నుంచి ఎస్సీ సెల్ విభాగం బీసీ సెల్ విభాగం మహిళా విభాగం నుంచి జిల్లా యువజన నాయకులు మరియు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజుఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు పాల్గొని అందులో భాగంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రయజనాలే లక్ష్యంగా ప్రసంగించ నున్నారని అన్నారు.ముఖ్యంగా పోలవరం ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేసే ప్రక్రియ,విశాఖ ఉక్కు పరిరక్షణ,ఉద్యోగ నియామకాలు,ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతిని ప్రకటించాలని వాటిపై కాంగ్రెస్ పార్టీ జాతీయనేత లు ప్రసంగించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.ఈ నెల24న జరగబోయే చలో విజయవాడ కార్య క్రమానికి జిల్లాల వారిగా నాయకులు, కార్యకర్తలు,అనుబంధ సంఘాలు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.లక్ష 1116 విరాళం

విశాలాంధ్ర -సుండుపల్లె : శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం చుండుపల్లి మండలం ఏటిగడ్డ రాచపల్లి దగ్గర శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఏటిగడ్డరాచపల్లికు చెందిన కొండూరు నారాయణరాజు వారి కుటుంబ సభ్యులు ఆలయ నిర్మాణానికి గాను ఒక లక్షా 1116 రూపాయలు విరాళాలు ఇవ్వడం జరిగింది. కావునా వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ కలియుగ వెంకటేశ్వర స్వామి అష్టైశ్వర్యాలుఇవ్వాలని కోరుకుం టున్నామని ఓం నమో వెంకటేశా గోవిందా గోవిందా చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం: డాక్టర్ సృజన

విశాలాంధ్ర-నందలూరు : మండల పరిధిలోని పలు గ్రామాలలో విష జ్వరాలు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తమైన మండల వైద్య శాఖ ఈడిగపల్లి, మదన మోహనపురం గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారిని డాక్టర్ సృజన తెలిపారు. విష జ్వరాలు నమోదైన గ్రామాలలో సుడిగాలి పర్యటన చేసి ఆయా గ్రామాలలో జ్వర పీడితులకు రక్త పరీక్షలు, రక్త పూతల సేకరణ, వైద్య పరీక్షలు, వైద్య సహాయం, ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శుల సహకారంతో దోమల మందు పిచికారీ చేయించాలని, మురుగు నీటి నిల్వ లేకుండా చూడాలని ఏన్ఎంలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి స్వామి దాస్, టీ బి సూపర్వైజర్ ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, ఎం ల్ హెచ్ పి లు, ఏ న్ ఎం లు, ఆశలు, పాల్గొన్నారు

మసీదు మరమ్మతులకు విరాళం

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి ముస్లిం మత పెద్దలకు అందజేశా రు. ఈ సందర్భంగా గంగారపు రామదాస్ చౌదరి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మసీదుల అభివృద్ధి కోసం ఇటీవల రూ.25 లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన స్ఫూర్తితో తన వంతు సాయంగా పోతబోలు మసీదు నిర్వహణ కోసం రూ.10 వేలు విరాళం ఇవ్వడం జరిగిందని వివరించారు. మసీదు మత గురువులు మహమ్మద్ ఫుర్ కాన్, కార్యదర్శి హదర్ ??సాబ్, ముతవల్లి షంషీద్ , ఆధామ్ సాబ్, మహబూబ్ బాషా, సాదిక్, హైదర్ వలి లకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, ఐటి విభాగం జగదీష్, జిల్లా కార్యదర్శి సనా ఉల్లా, రామసముద్రం మండలం అధ్యక్షులు చంద్రశేఖర్, కుమార్, రెడ్డెమ్మ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై లోకయుక్తకు ఫిర్యాదు

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న తపస్య పాఠశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవు. వ్యవసాయ భూమిలో కమర్షియల్ బిల్డింగ్ కడుతున్న దానికి సంబంధించిన ల్యాండ్ కన్వర్షన్ మండల రెవెన్యూ అధికారుల నుంచి తీసుకోలేదు. ఆ తర్వాత గ్రామ పంచాయతీ నుంచి లేఅవుట్ అప్రోవల్ కూడా తీసుకోలేదు. ఇవేమీ లేకుండా కూడా బిల్డింగ్ పనులు సరే వేగంగా జరుగుతున్నాయి. దానికి సంబంధించి నటువంటి అధికారులు పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, మండలాల రెవెన్యూ అధికారికి అనేక సార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదు. అదేవిధంగా ప్రవేట్ పాఠశాల అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ము అని కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్నారు. ఈ విషయంపై మండల విద్యాధికారి ఫిర్యాదు చేసిన పట్టించుకోని పక్షంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు టి ఎల్ వెంకటేష్, డిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఇలాంటి పాఠశాలలపై పాఠశాల యాజమాన్య సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరడం జరిగిందని అన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలు

విశాలాంధ్ర- రామసముద్రం: వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంద ని మదనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే రమేష్ ఆరోపించారు మంగళవారం అయన రామసముద్రం మండలంలో పర్యటించారు. నారి గాని పల్లె ఎలకపల్లి కమ్మవారిపల్లె పంచాయతీ లలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు గౌని వారి విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో జరిగింది. కమ్మ వారిపల్లెలో రచ్చబండ నిర్వహిం చారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంజం వెంకటరమణ రాజంపేట పార్లమెంట్ కోశాధికారి సీతప్ప చిన్న రెడ్డప్ప నాయుడు మాజీ ఎంపిటిసి నరసిం హులు వెంకటేష్ టేకుపల్లి రామ్మూర్తి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ గోదాం వద్ద జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : గ్యాస్ గోదాం వద్ద అక్కడ పనిచేస్తున్న సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని అజ్ఞాపక ఫైర్ ఆఫీసర్ బాల హుస్సేనయ్య పేర్కొన్నారు.అగ్నిమాపక వారోత్సవా ల్లో భాగంగా మంగళవారం లక్కిరెడ్డి పల్లె హెచ్ పి పెట్రోల్ బంక్ ,హెచ్ పి గ్యాస్ గోదాం వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హుస్సేనయ్య మాట్లాడుతూ గోదాంలో గ్యాస్ నిలవ ఉన్నప్పుడు ఎక్కడైనా సిలిండర్ లీకైతే తీసుకొ వలసిన జాగ్రత్తగా గురించి వివరించారు. అలాగే పెట్రోల్ బంక్ వద్ద అగ్గి ప్రమాదం జరిగినప్పుడు తీసుకోని జాగ్రత్త గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయి ,సుదర్శన్ ,వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ స్థలంలో అక్రమ ఇంటి నిర్మాణం
అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాష

విశాలాంధ్ర- మదనపల్లి : మదన పల్లి గ్రామీణ మండలం చీకల బైలు పంచాయతీ బెంగళూరు రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిని గ్రామస్తులతోపాటు జడ్పీ హైస్కూల్ సిబ్బంది అడ్డుకున్నారు, విషయం తెలుసుకున్న తెదేపా నాయకుడు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ భాష సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఎవరు నిర్మాణాలు చేపట్ట రాదని, అలా కాకుండా నిర్మాణాలు చేపడితే గ్రామస్తుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.. సచివాలయ వీఆర్వో రెడ్డి రాణి, సర్వేయర్ సురేష్ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న కృష్ణమూర్తి కుమారుడు రమేష్ ను ఇంటి నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

విశాలాంధ్ర -మదనపల్లి : రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి గుర్రంకొండ మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రతి ఇంటి గడప కు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. గ్రామాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ప్రతి ఇంటా తెలిపారు. గడపగడప కార్యక్రమంలో అభివృద్ధి పనులకు కావాల్సిన డబ్బులు అక్కడికక్కడే మంజూరు చేశారు. ఎంపీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసీపీలో కి కనకాని సుధాకర రమణమ్మ చిత్ర వెంకటరమణ కండవ వేసి సాధారణంగా వైసీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హరీష్ రెడ్డి మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, జడ్పిటిసి సమీన్ ముక్తియ, ఆర్.బి.కె చైర్మన్ జయచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జమీర్ అలీ, సచివాలయ కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపీపీ నక్క చంద్రశేఖర్, ఎంపీటీసీ రాజగోపాల్, సింగంశెట్టి రెడ్డి కుమార్, మాజీ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ల వద్ద సెల్ ఫోన్ మాట్లాడడం ప్రమాదకరం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మోటార్ బైక్‌లకు, కార్లు, జీబులు, లారీలకు, స్కూల్ వ్యాన్‌లకు పెట్రోల్ డీజిల్ నింపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడడం పెను ప్రమాదకరం అని ఫైర్ ఆఫీసర్ కె.విజయ్ కుమార్ పేర్కొన్నారు. 79 వ అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమైన 5 వ రోజు మంగళవారం ముప్టేరు సమీపంలోని పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద, సిద్దేశ్వర సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న మల్లెంకొండు పెట్రోల్ బంక్ లవద్ద చేపట్టిన అవగాహన సదస్సులో ఫైర్ ఎస్ఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు, మోటార్ బైక్ లకు పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసి పెట్రోల్ డీజిల్ నింపాలన్నారు. దూరంగా పోయి సెల్ ఫోన్ మాట్లాడడం మంచి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు పంచుతూ స్థానికులలో చైతన్యం తీసుకువచ్చారు. పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ఓనర్ పెండ్యాల విజయ్ కుమార్, లీడింగ్ ఫైర్ మేన్స్ వెంకటసుబ్బయ్య శేషయ్య, సుబ్బరాయుడు, డ్రైవర్ కం ఆపరేటర్ లు ప్రదీప్ కుమార్, నవీన్ కుమార్ ఫైర్ మేన్స్ సుధీర్ బాబు సురేష్ వెంకటేశ్వర రాజు హోంగార్డులు రమేష్ బాబు, రాము పాల్గొన్నారు.

నల్లగంగమ్మ తల్లి తిరుణాలను దిగ్విజయం చేద్దాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: సమిష్టి కృషితో సంబేపల్లె శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ తల్లి తిరుణాలను దిగ్విజయం చేద్దా మని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.మే నెల 5 న జరగనున్న సంబేపల్లె గ్రామంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ తిరుణాల మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.దాతల సహకారం, అందరి కృషితో తిరుణాలను విజయంతం చేసి ఆలయ ఖ్యాతిని పెంపొందించుదామని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి,సర్పంచుల సంఘ అధ్యక్షుడు చిదంబర్ రెడ్డి, మాజీ జెడ్ పి టిసి గొర్ల ఉపేంద్రా రెడ్డి,మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, శ్రీ దేవర రాయి ఆలయ నిర్మాణ కర్త ,ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీ స్వామి, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచులు అంచల రామచంద్ర, వెంకట రమణ నాయక్, ఎంపిటిసిలు భద్రయ్య, శ్రీధర్ రెడ్డి,మాజీ సర్పంచ్ దేవపట్ల వెంకట్రామిరెడ్డి,నూర్ అహమ్మద్, రాష్ట్ర కార్యదర్శి వడ్డీ వెంకటరమణా రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు గడికోట చంద్రశేఖర్ రెడ్డి,కౌన్సిలర్ పల్లా రమేష్, పోస్టర్ల దాత వంగిమళ్ల వేణుగోపాల్ రెడ్డి, మోటకట్ల జె సి బి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సద్దుమణిగిన ఫ్లెక్సీ వివాదం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రంలో ఫ్లెక్సీ వివాదం జరగకుండా సిఐ ఎస్ విశ్వనాథరెడ్డి వ్యూహాత్మకంగా చొరవ తీసుకుని వ్యవహరించి టిడిపి, వైకాపా నాయకులకు కార్యకర్తలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఫ్లెక్సీ వివాదం సద్దుమణిగిందని సిఐ తెలిపారు.అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాల మేరకు రాజంపేట డిఎస్పి శివభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలన్న వారు ముందస్తుగా పోలీసుల నుండి, పంచాయితీ వారి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి తీసుకున్న తరువాత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.వివాద స్పద స్థలాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. ఫ్లెక్సీ లో వ్యక్తి గతంగా విమర్శించే విధంగా ఉండరాదన్నారు. నిబందనలను అతిక్రమిస్తే జరిమానా విధించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-వల్లూరు : దక్షిణకాశీగా విరాజిల్లుతున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పుష్పగిరి. హరిహరాదులను ఏకకాలంలో దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రం వద్ద పంచమ నదులు (పాపాఘ్ని, కుముద్వతి, వల్కల, మాండవి, పెన్నా) కలుస్తాయి. పుష్పగిరి గ్రామంలో కామాక్షి సమేత చెన్నకేశవులు కొలువు దీరడంతో హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పుష్పగిరిలో చోళరాజులు 108 శివలింగాలను ప్రతిష్ఠించారని చారిత్రక ఆధారాలు న్నాయి. కరికాల చోళుడు ఈ క్షేత్రాన్ని దర్శించి శివలింగాలను ప్రతిష్ఠించాడు.

పుష్పగిరికి ఆ పేరు ఎలా వచ్చిందంటే: పుష్పగిరి అనే పేరు ఎలా వచ్చిందనే విషయంపై స్థానికంగా ఓ కథనం ప్రాచుర్యంలో ఉంది. పుష్పగిరికి పూర్వం కంపల్లె గ్రామమని పేరు. గరుత్మం తుడు తన తల్లికి శాప విమోచన కోసం అమృతభాండాన్ని తస్కరించి పారి పోతుండగా ఇంద్రుడు వజ్రాయుధంతో వెంబడిస్తాడు. ఆ సమయంలో మరింత వేగంతో వెళుతుండగా గరుత్మంతుడి చేతిలో ఉన్న అమృతభాండం నుంచి ఒక చుక్క అమృతం ఇక్కడి నదిలో పడింది. ఆ సమయంలో కంపల్లెకు చెందిన ఒక ముసలి రైతు తన ఎద్దులతో సహా నదిలో స్నానం చేస్తుండగా ఆయన యువకుడిలా మారిపోయాడు. ఈ విషయం ఆ నోట ఈనోటా వెళ్లి బ్రహ్మదేవుడిని చేరింది. దీంతో బ్రహ్మదేవుడి ఆదేశాల మేరకు ఆంజనేయస్వామిని ఒక కొండను ఈ నదిలో వేశాడు. కొండ నదిలో తేలియాడుతూ ఉండిపోయింది. దీంతో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తమ పాదాలతో ఆ కొండను తొక్కడంతో నీటిలోకి దిగింది. అలా తొక్కడంతో పుష్పం ఆకారంలో కొండ ఏర్పడడంతో పుష్పగిరి పేరు వచ్చిందని ప్రతీతి.

పుష్పగిరి శిల్ప కళాపురి: పుష్పగిరి శిల్ప కళాపురిగా విరాజిల్లుతోంది. ఇక్కడ అనేక నల్లరాతి శిల్పాలు ఉన్నాయి. ద్రవిడ నిర్మాణ శైలి గోపురాలు, ప్రాకారాలు ఆకట్టు కుంటున్నాయి. 1200 సంవత్సరాల కాలం నాటి నిర్మాణశైలి నేటికీ చెక్కుచెదర లేదు. కొండ పైన శివకేశవ ఆలయం చుట్టూ నల్లబండలపై చెక్కిన శిల్పాలు ఉన్నాయి.

ఒక్కో శిల్పం ఒక్కో చరిత్రను తెలియజేస్తుంది. జగద్గురువు ఆదిశంకరా చార్యుల పీఠంగా ఇది విరాజిల్లుతోంది. పుష్పగిరి గ్రామంలో వైద్యనాథేశ్వరుడు, ఆలయంలో త్రికుటే శ్వరస్వామి, భీమలింగేశ్వరస్వామి, ఉమామహేశ్వర స్వామి అలాగే కొండపై సాక్షి మల్లేశ్వరస్వామి, సంతాన మల్లేశ్వరస్వామి ఆలయాలతో పాటు రుద్ర పాద ఆలయాలు ఉన్నాయి. పుష్పగిరిలో ఒక్క రోజు ఉపవాసంతో ఉండి హరి హరాదులను దర్శిస్తే ఎంతో పుణ్యం వస్తుందని, అక్షయ తృతీయ రోజు సంకల్పంతో నదిలో స్నానం ఆచరించి శివకేశవులను దర్శిస్తే వంద అశ్వమేధ యాగాలు చేసిన ఫలం లభిస్తుందని నానుడి.

బ్రహ్మోత్సవాలు: ఈ నెల 18వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 27 వతేదీ వరకు కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మి సమేత చెన్నకేశవులు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, ఈఓ మహేశ్వర్రెడ్డి, పూజారి అఖిల్ దీక్షితులు తెలిపారు. ప్రతిరోజూ శివకేశవులను ఒక్కో అవతారంలో ఆయా వాహనాల్లో ఊరేగిస్తారు. అక్షయ తదియ 23న గరుడవాహనం, 24న కల్యాణం, 25న రథోత్సవం బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైనవి.

23న ఓల్డ్ కాటగిరి ఎద్దుల పోటీలు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23న సాయంత్రం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. మొత్తం ఏడు బహుమతులు ఉంటాయని, అలాగే పాల్గొన్న ప్రతి కాడికి కన్సొలేషన్ బహుమతి కూడా అందిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఆరోజు ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మండుతున్న ఎండలు

-ఠారెత్తిస్తున్న ఉష్ణోగ్రతలు

విశాలాంధ్ర-వేంపల్లె: నిండు వేసవి అరుదెంచడంతో ఎండలు మండుతున్నాయి, ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచి ఎండలు మండుతున్నాయి. వేసవి తాపం పెరగడంతో ఉదయం 8 గంటల తర్వాత బయటకు వచ్చేందుకుప్రజలు జంకుతున్నారు వేసవి తీవ్రతను తట్టుకునేందుకు శీతల పానీయాలు చల్లని పదార్థాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మరికొన్ని రోజులు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తీవ్రమైన ఎండల దాటికి వ్యవసాయ ఉపాధి హామీ కూలీలు, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. అంగనవాడి ప్రాథమిక పాఠశాల కేంద్రాల్లో చిన్నారుల కోసం ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇందులో బయటకు వచ్చిన జనం శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు, పళ్ళ రసాలను ఆశ్రయిస్తున్నారు. ఉక్కపోతకు ఉక్కిరి అవుతున్న ఉద్యోగులు వ్యాపారులు ఫ్యాన్లు కూలర్లు ఏసీల వాడకంతో కరెంటు వినియోగం రెండు రెట్లు అధికమైంది. మార్కెట్లో లభించే చల్లని శీతల పానీయాల కంటే మట్టి బానలో నీరు నిల్వ చేసుకొని తాగడమే మంచిదని వైద్యులు

సూచిస్తున్నారు. ఇలాంటి నీరు సేవించడం వల్ల దప్పిక తీర్చుకునే అవకాశం ఉంది. తీవ్రమైన ఎండల దృష్ట్యా వైద్య నిపుణులు జాగ్రత్తలు సూచిస్తున్నారు. అరు బయట పనులు సాయంత్రం వేళల్లో చేసుకోవాలని అలాగే శరీరానికి వేడి తగలకుండా తెలుపు కాటన్ వస్త్రాలు ధరించడం మేలని చెబుతున్నారు. అదేవిధంగా తలకు టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలని కూడా సూచిస్తున్నారు ఎండలలో పనిచేసే రైతులు కార్మికులు, వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ కూలీలు మంచినీరు అధికంగా తాగుతూ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచు కోవాలని వైద్యులు వెల్లడించారు. వేసవిలో ఎక్కువగా తిరిగే వారికి డయేరియా వంటి వ్యాధులు సంభవిస్తాయని కూడా వైద్యులు సూచి స్తున్నారు. వేసవి ముగిసే వరకుతగు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వీలైనంతవరకు సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణాలను మానుకోవడం మంచిది. అలాగే మంచినీరు కూడా ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. మార్కెట్లో లభించే చల్లని శీతల పానీయాల కంటే మట్టి బానలో నిల్వ చేసుకొని నీరు సేవించడం మనిషికి శ్రేయస్కరమని డాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికే వేసవి సగ కాలం ముగిసింది. మరో నెలపాటు గడిస్తే కానీ ఎండలు తగ్గే అవకాశం కనిపించలేదు. నైరుతి రుతుపవనాల వల్ల వాతావరణంలో మార్పు చేసుకుని కాసిన్ని వర్షాలు కురిస్తే వాతావరణ చల్లబడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రజలు కూడా ఈ వేసవి ముగిసే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నారా చంద్రబాబునాయుడు ను కలిసిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను మంగళవారం రాయచోటి నియోజకవర్గం టిడిపి యువ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన అనుచరులతో మర్యాదపూర్వకంగా కలిశారు కడప పట్టణం లో జోన్-5 సమీక్ష సమావేశానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కడప విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుల కార్యకర్తల పనితీరు రాజకీయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయాలని భారీ మెజార్టీతో రాయచోటి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలని చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డికి సూచించారు అనంతరం చంద్రబాబు నాయుడు జోన్-5 సమావేశానికి వెళ్లారు . రాంప్రసాద్ రెడ్డి వెంట మాజీ ఎంపీటీసీ మదన్ కొండారెడ్డి రాజు పాల్గొన్నారు.

రంజాన్ పురస్కారాల ప్రదానం

విశాలాంధ్ర-పీలేరు: తిరుపతి జిల్లా, రేణిగుంటలో ఎంఏ జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ ఫరీద్ బాబా పవిత్ర రంజాన్ మాసం పురస్కారాలను ప్రదానం చేశారు. మంగళవారం రేణిగుంటలోని మంచినీళ్ళ గుంట సమీపంలో ఉన్న ట్రస్ట్ కార్యాలయం వద్ద 'లైలతుల్ ఖద్ర్' (బఢీ రాత్) సందర్భంగా ఆయన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబా వివిధ రంగాల్లో నిష్ణాతులైన 11 మంది సాహితీవేత్తలు, కళాకారులు, నిపుణులకు దుశ్శాలువా కప్పి, పూలమాల, జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ నాటి రాజుల కాలంలో కవులు, కళలు, కళాకారులకు ఎంతో ప్రోత్సాహం ఉండేదని అన్నారు. ఆదరణ కరువౌతున్న ఈ కాలంలో ఫరీద్ బాబా నేటి తరం సాహితీ ప్రియుడు, కళాపోషకుడుగా, కుల, మతాలకతీతంగా, వివిధ రంగాలకు చెందిన ఎంతోమందిని వివిధ సందర్భాల్లో సన్మానిస్తూ, సత్కరిస్తూ అర్హులైన వారికి ఎన్నో సేవా కార్యక్రమాలను ఆనవాయితీగా అందిస్తూ ఉన్నారని చెప్పారు. ఫరీద్ బాబాకు ఆ అల్లా, భగవంతుడు, జీసస్ ఇవే సహాయ, సహకారాలు అందిస్తూ మరి కొంతమందికి స్ఫూర్తి ప్రధాతగా నిలిచేలన్న అభిప్రాయాన్ని, ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సాంప్రదాయ రీతిలో సన్మానం అందుకున్న 11 మంది ప్రముఖుల్లో తిరుపతికి చెందిన సీనియర్ కళాకారుడువాసు, సీనియర్ రంగస్థల కళాకారుడు, నంది అవార్డుల న్యాయనిర్ణేత జంగం ధర్మారావు, బుల్లి, వెండితెర నటుడు గుల్జార్ గౌస్, శ్రీకాళహస్తి కి చెందిన ప్రముఖ నృత్య దర్శకురాలు ఆష, అంతర్జాతీయ బహుభాషా రంగస్థలం, బుల్లి, వెండితెర కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పీలేరుకు చెందిన షేక్ ఖాదర్ బాష, రేణిగుంట వాసి అయిన ఉత్తమ ఉపాధ్యాయుడు ఆర్. నరకేశరి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మార్కెటింగ్ మేనేజర్ నందకుమార్, తిరుపతికి చెందిన సీనియర్ కంప్యూటర్ ఇంజనీర్ వై. రామకృష్ణ, టీటీడీ ఉద్యోగి విజయ్ కుమార్ రెడ్డి, తిరుపతి ఏ-1 క్యాటరింగ్ నిర్వాహకులు షేక్ మస్తాన్ తదితరులున్నారు. అనంతరం ఫరీద్ బాబా రంజాన్ మాసం సందర్భంగా వందమంది పేద ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మధు, వాసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- విప్లవాత్మక మార్పులతో .. ఆదర్శంగా జగనన్న పాలన...
- గడప గడప కు మన ప్రభుత్వంలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు అని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.రాయచోటి మున్సిపాలిటీ లోని 12 వ సచివాలయం,19 వార్డు పరిధిలో ఉదయం 6 గంటలకే గడప గడపకు మన ప్రభుత్వం ను శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. లక్ష్మీపురం, దూదేకుల పల్లె,సరస్వతి వీధి,గాలివీడు రహదారి మార్గంలలో ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ,ప్రజా సమస్యలపై శ్రీకాంత్ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విప్లవాత్మక మార్పులతో జగన్ పాలన సాగుతోందన్నారు. ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికిన మహిళలు: గడప గడప కు విచ్చేసిన ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ని దూదేకులపల్లె ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు.- దూదేకులపల్లె కు చెందిన పరసా ఎల్లమ్మ తన కుమార్తెకు జగనన్న అమ్మఒడి ద్వారా ఆర్థిక సహాయం అందిందని ఎంఎల్ఏ ఎదుట హర్షం వ్యక్తం చేశారు.

- దూదేకులపల్లె లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని శ్రీకాంత్ రెడ్డి ఆదేశం,
- దూదేకులపల్లెలో గుండ్లూరి మనోహర్ కు వైఎస్ఆర్ వాహనమిత్ర ద్వారా ఆర్థిక సహాయం అందిందని వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
- పాలగిరి ఎల్లమ్మ తనకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం పొందానని శ్రీకాంత్ రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు.

ఆదర్శ కాలనీగా లక్ష్మీపురం ను అభివృద్ధి చేస్తాం: లక్ష్మీపురంలో అన్ని రకాలుగా మౌలిక వసతులను కల్పిస్తామని ఆదర్శ కాలనీ గా తీర్చిదిద్దుతామని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.లక్ష్మీ పురంలోని అన్ని వీధులలో ఇంటింటా శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు.అభివృద్ధి పనులుపైన, సమస్యలుపైన చర్చించారు.మేజర్ స్ట్రామ్ వాటర్ డ్రెన్ ను నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.భూగర్భ డ్రైనేజీ, రహదారుల నిర్మాణాలును చేపడతామని తెలిపారు.

ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా: గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎర్రటి ఎండను సైతం శ్రీకాంత్ రెడ్డి లెక్కచేయకుండా ప్రతి ఇంటినీ సందర్శించారు.సాధారణ ప్రజలు, పథకాలు అందని వారు, ఉద్యోగులును అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సాధక బాధలను విని వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష,మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ జయన్న నాయక్, భాస్కర్, పల్లా రమేష్,మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, ఆర్ట్స్ శంకర్,రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పురస్కారాల ప్రదానం

కంటి అద్దాల పంపిణీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్థానిక మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కంటి చూపుతో బాధపడుతున్న విద్యార్థినీ విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ జరిగింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అంధత్వ నివారణ పథకం, డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు ఫేస్ - 3 కింద అద్దాల పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ రీయాజ్ బేగ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని కంటి చూపు తో బాధపడుతున్న 26 మందికి అద్దాలను పంపిణీ చేశారు. తమ పాఠశాలను ఈ కార్యక్రమమునకు ఎంచుకున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జానకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శెట్టెం. ఆంజనేయులు, వెంకటనారాయణ మరియు ఎస్. డి. సి. రంజిత, ఏ.ఎన్.ఎం లు సలీమా, సావిత్రి పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం అభివృద్ధికి వినతి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న హార్సిలీ హిల్స్ లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (రీజనల్ ట్రైనింగ్ సెంటర్) అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ కి మంగళ వారం ఉదయం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యం లో స్కౌట్ అధికారులు

ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. దాదాపు 60 సంవత్సరాల నుండి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులతోపాటు రాయలసీమ జిల్లాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలియజేశారు. శిక్షణా కేంద్రం నందు ప్రస్తుతం ఉన్న భవనాలు కూలిపోయే దశలో ఉన్నందున నూతన భవనాల నిర్మాణానికి, సుందరీకరణకు అవసరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర కింది నుండి హార్సిలీ హిల్స్ కు చేర్చడానికి అనుమతి మంజూరు చేయాలని విన్నవించారు. సామాజిక సేవ, దేశ భక్తి, క్రమశిక్షణను విద్యార్థులలో పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తోడ్పడుతుందన్నారు. రిపబ్లిక్ డే పేరేడ్ లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు పలువురిని ఆకర్షించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, సీనియర్ గైడ్ కెప్టెన్ శకుంతల, జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, స్కౌట్ మాస్టర్లు మార్ల ఓబుల్ రెడ్డి, బచ్చల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని వైఎస్ఆర్ సిపి మైనారిటీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. రంజాన్ పండుగ సంధర్భంగా వైఎస్ఆర్ సిపి మైనారిటీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ మంగళవారం రాయచోటి పట్టణంలోని బండ్లపెంట, కొత్తపల్లె, ట్రంక్ రోడ్డు ప్రాంతాల్లోని రెండు వేల కుటుంబాలకు చీర, పంచ, షర్టు లను పంపిణీ చేశారు. ప్రతి ఏటా రంజాన్ పండుగ సంధర్భంగా మైనారిటీ సీనియర్ నాయకులు బషీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఆయన తనయుడు వైసిపి మైనారిటీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ పేద ప్రజలకు బట్టలు, బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా పేద ప్రజలకు బట్టలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సంధర్భంగా మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ పేద ప్రజలక సేవా చేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి ఏటా రంజాన్ పండుగ రోజు పేద ప్రజలకు తాము ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనారిటీ నాయకులు బేపారి జబివుల్లా ఖాన్, కొత్తపల్లె ఇంతియాజ్, బేపారి అసద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంపై సీబీఐ బురదజల్లే ప్రయత్నం

వైసీపీ మండల నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య

విశాలాంధ్ర-అట్లూరు : మొదటి నుండి సీబీఐ ఈ కేసును ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టిందని వైఎస్ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని వైసీపీ మండల నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య అన్నారు. మంగళవారం అట్లూరు క్రాస్‌రోడ్డులోని అవధూత రెడ్డయ్య మఠంలో విశాలాంధ్ర విలేకరితో ఆయన మాట్లాడారు. అసలు నేరస్తులను తప్పించి వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిని ఇరికించే కుట్ర పన్నుతున్నారని అతి కిరాతకంగా అత్యంత పాశవికంగా నరికి చంపిన నేరస్తులైన దస్తగిరి బెయిల్ మీద బయట తిరుగుతుంటే తండ్రిని చంపిన దస్తగిరిని సునీతమ్మ వెనకేసుకు రావడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే వైఎస్ వివేకానంద రెడ్డి మరణానంతరం ఆయన మరణ వాంగ్మూలం ఉత్తరాన్ని దాచిపెట్టమని సునీత భర్త శివప్రకాశ్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేయడం జరిగిందన్నారు. మంచికి మారుపేరు మచ్చలేని మహామనిషి కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పై అసత్య ఆరోపణలు మానుకోవాలని ఈ సందర్భంగా పోతిరెడ్డి రెడ్డయ్య పేర్కొన్నారు. మండలాధ్యక్షురాలు పొత్తపి రమాదేవి, వైసీపీ నాయకులు సింగన ఓబుల్‌రెడ్డి, అగ్రహారం నరసారెడ్డి, పొత్తపి నరసింహ, పెంచలయ్య, సచివాలయాల మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.